# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

జనవరి 2024

వెల : రూ. 10.00




శ్రీ గోదాదేవి

నవంబరు 30 నుండి డిసెంబరు 7 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన
శ్రీ సద్గురు దేవుల 35వ వార్షిక పూణ్యారాధన దృశ్యములు.



దీక్షా స్వీకరణ



అఖండ దీప
జ్వలనము



శ్రీ సద్గురు
పాదుకా ప్రదక్షిణ



శ్రీ సద్గురు
లక్ష నామార్చన

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 43 సంచిక 5

పేజీలు 44

జనవరి 2024

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 9

పాజిటివ్ థింకింగ్..........................................11

జీవేశ్వరుడు ....................................................13

శ్రీ గణేశ తత్వం ............................................15

ఏకాగ్రత ..........................................................18

దివ్య బరువు.................. ................. .................. 21

కంచి పరమాచార్య ...... ..................................25

నారద భక్తి సూత్రములు ............... ..............27

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......29

మనశ్శతకము ................................................30

నిరీక్షణ ...........................................................31

జ్ఞాన సముపార్జన........ ........ ........ ..... ... ....33

బిచ్చగాడు .................................................... ...34

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37

విష్ణు కథలు ...... ............................ ....................40


**పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024**

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

42) గద్దరియో గిహృత్కమల గంధర సానుభవంబుఁజెందు పె
న్నిద్దవు గండుఁ దేఁటి ధరణీసుత కౌఁగిలిపంజరంబునన్
ముద్దులుగుల్కురాచిలుక ముక్తినిధానమురామరాఁగదే
తద్దయు సేఁడు నాకడకు దాశరథీ! కరుణాపయోనిధీ!



భావం - ఓ రామా! నీవు యోగి హృదయ కమలముల నుండెడి తుమ్మెదవు. సీతాదేవి బాహు పంజరమునకు రామచిలుకవు. వాటి నుండి విముక్తుడవై నా కడకు వచ్చి నన్ను కాపాడుము.

*తన శిష్యుని ఉద్ధరించడానికి పులి రూపాన్ని ధరించిన గురువు ఎవరు?
*సాధకుడికి కొబ్బరి చెట్టుకి ఉండే పోలిక ఏమిటి?
*రోజూ ఇంటి పై కప్పు పైకెక్కి తమ శిష్యులను పిలిచే గురువుగారు ఎవరు?
*శిష్యుడు బెస్తవాని నుండి ఏమి నేర్చుకున్నాడు?
*లంబోదరుడు అంటే అర్థం ఏమిటి?
*ఎన్నో పుణ్యాలు చేసిన వెంకట్రావు నరకానికి ఎందుకు వెళ్ళాడు?
*ఇద్దరూ ఒకే రకమైన కష్టాలు అనుభవించినా ఒకరు ధర్మమార్గంలో మరొకరు అధర్మమార్గంలో ప్రయాణించినవారు ఎవరు?
*రాముడు పంది రూపాన్ని ఎందుకు ధరించాడు?
*ఎవరికి కల్పాంతము వరకు గురుతత్వము అర్థం కాదు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

25-11-1980

ఈ రోజు రాత్రి ప్రార్థన అయిన తర్వాత ముందుగా శ్రీ బాబూజీ భక్తులకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఇంటర్వ్యూలు అయిన తర్వాత భక్తులకు వుద్బోధిస్తూ "మీరంతా నాకోసం వేచి వున్నారు కదూ! మన ఇంట్లో ఒకరికి జబ్బు చేసిందనుకోండి, ఎవరికైనా శాంతి వుంటుందా? లేక ఒక కుటుంబంలో ఏదో పరిష్కారం కాని వ్యవహారం ఉందనుకోండి, అప్పుడు మాత్రం శాంతి ఉంటుందా? నన్ను ఆశ్రయించిన మీకు శాంతి లేకపోతే నాకు శాంతి ఉంటుందా? నన్ను శాంతిగా వుండనిస్తారా?" అని ప్రశ్నించారు శ్రీ బాబూజీ.



దాను ప్రశ్నిస్తూ "శ్రీ శంకర భగవత్పాదుల వారు అద్వైతాన్ని బోధించారు కదా మరి గురుశిష్యుల మధ్య ద్వైతము ఉండవచ్చునా?" అన్నారు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "విఠల్ ! చక్కని ప్రశ్న వేశావు. గురువు దగ్గర ఎన్నడూ మనస్సు దాయకూడదు. మనస్సులో మరుగు ఉందంటే వెంటనే మాయ ప్రవేశిస్తుంది. అందుచేత మనస్సులో దాపరికము ఉండకూడదు. సద్గురుమూర్తి పరమేశ్వర స్వరూపుడు. సాక్షాత్తు అవతారమూర్తి. శ్రీ శంకర భగవత్పాదులవారు అద్వైతాన్ని బోధిస్తూ అంతటా వ్యాప్తమై ఉన్న ఆత్మ వస్తువు ఒక్కటే, ద్వైతానికి తావులేదని చెప్పారు. కాని గురుదేవుని విషయంలో మాత్రం ద్వైతం తప్పదు. గురుదేవుణ్ణి హృదయములో నిలుపుకోవచ్చు కాని తానే గురువుననే భావన పనికిరాదు. గురుదేవుని వద్ద తాను ఒక సేవకుడిగా మాత్రమే భావించాలి. అదే సరియైన గురుతత్వము. అలా కాకుండా గురుదేవుని సాటి మానవునిగా తనతో సమానంగా చూసినవారికి కల్పాంతము వరకు గురుతత్వము అర్థము కాదు. అట్టివారికి ముక్తి లభించకపోవడమే

గాక పతనమే. జననమరణ విషవలయములో చిక్కుకుంటారు. మానవజన్మ ఉత్కృష్టమైనది సహస్ర కోటి జన్మలెత్తిన తర్వాత మాత్రమే మానవజన్మ లభిస్తుంది. మానవజన్మ ద్వారానే ముక్తిని సాధించ గలుగుతాడు. ఈ విశ్వాంతరాళంలో సహస్ర సూర్యగోళాలు, అనేక గ్రహాలు వున్నాయి. ఇన్నింటిలో హీనాతిహీనమైన సూక్ష్మమైన మానవుడు తానెవరో తెలుసుకొని ఆత్మస్థితిని పొంది, ఇన్ని గ్రహాలకూ అధినేత అవుతాడు. అది ఎట్టి ఉన్నతస్థితో ఆలోచించారా? అట్టి స్థితిని పొందడానికి గురువు అవసరం. మన మనస్సు నిర్గుణమైనది. జిహ్వ సగుణమైనది. పంచదార అందజేస్తే జిహ్వ మాధుర్యాన్ని తెలుసుకుంటుంది. దాని ద్వారా మనస్సు ఆనందాన్ని పొందుతుంది. ఆనందము నిర్గుణమైనది. నిర్గుణమైన మనస్సు మాత్రమే దానిని పొందగల్గుతుంది. సగుణమైన జిహ్వ పంచదార యొక్క మాధుర్యాన్ని రుచి చూస్తుంది.

అలాగే పరమాత్ముని సగుణంగా దర్శించి నిర్గుణంగా ఆనందించి చివరికి లయమైపోవటమే ముక్త స్థితి. ఆ స్థితిలో ఉన్నవాడికి ఇక దేనితోనూ పని లేదు. అదే సహజ సమాధి. సత్యగురువు ఎప్పుడూ ఆ స్థితిలో ఉంటాడు. పంచభూతాలు, సర్వజగత్తు అతని ఆధీనంలో ఉంటాయి. అట్టి మహాత్ముడు ఎప్పుడూ ప్రజాశ్రేయస్సునే కోరతాడు. ఆ మహాత్ముని అంతరంగంలో భావనచేత సర్వజగత్తు సుభిక్షంగా ఉంటుంది. అటువంటి మహాత్ముడు ఒక్కడు ఉంటే చాలు. ఎంతమందినైనా తరింపజేయుగలుగుతాడు. యావత్ప్రపంచానికి ప్రకాశాన్ని అందించేది ఒక్క సూర్యభగవానుడే కదా! సూర్యగోళంలో అనేక అణవులు విస్ఫోటం చెందటంవలన శక్తి వుత్పన్నమవుతుంది. ఆ శక్తియే సర్వమానవ శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. ఆసూర్యగోళంలో క్షణంపాటు శక్తి ఉత్పాదన నిలిచిపోతే ఏమవుతుంది? ప్రళయం సంభవిస్తుంది" అన్నారు శ్రీ బాబూజీ.

"గురువుయందు అచంచల విశ్వాసము కల్గి ఉండాలి. అది ఏ మాత్రము సన్నగిల్లినా మాయ కమ్మివేస్తుంది. అది శరీరమంతా వ్యాప్తమై పతనానికి దారితీస్తుంది. దానిద్వారా సంకల్పములు, సంకల్పముల ద్వారా సంకటములు కలుగుతాయి. ఒక మహావృక్షము ఉందనుకుందాం. దాని తల్లి వేరు చాలా పెద్దది. దాని కొసన అతి సూక్ష్మమైన వేరు ఉంటుంది. దాని

ద్వారా భూమిలోని క్రిమి వృక్షములోనికి ప్రవేశించి ఆ వృక్షం అంతా వ్యాప్తమై దాని పతనానికి దారితీస్తుంది. ఒక ఆనకట్ట కట్టారనుకోండి. దానిలో అతి సూక్ష్మమైన వెంట్రుకవాసి రంధ్రము ఉందనుకోండి. అది ఆ ఆనకట్టనే కూలగొడుతుంది కదా! అంత ఎందుకు? మానవుని శరీరంలోకి మందు ఎక్కించాలనుకోండి. ఇంజక్షను సూది ఎంత సూక్ష్మంగా ఉంటుంది! దాని ద్వారా మందు ఎక్కిస్తారు. అది శరీరమంతా వ్యాప్తి చెందుతుంది కదా! అలాగే మాయ ఏమాత్రం మరుగు దొరికినా ప్రవేశించి మనస్సును కలుషితం చేస్తుంది. కాబట్టి గురుభక్తిలో విశ్వాసం రవ్వంత సడలినా పతనము తప్పదు.

గురుదేవుడు మహాత్ముడు, జ్ఞాని. ఒక చెట్టుక్రింద నేత్రాలు మూసుకుని కూర్చున్నా, ఆ చుట్టూ తిరిగే అన్నింటినీ చూడగలడు. సర్వ ప్రకృతిని శాసించగలడు. కాని ఆ చెట్టు చుట్టూ తిరుగుతూ ఉండేవాడికి మాత్రం నేత్రాలు తెరుచుకునే ఉన్నా ఏమీ తెలియదు. అదే అజ్ఞాన స్థితి. గోపికలు తమాల వృక్షాన్నే శ్రీ కృష్ణునిగా భావించి తమ దేహాన్ని మరచి తన్మయలై తమ మనస్సులలో ఆ మూర్తినే ముద్రించుకున్నారు. సర్వత్రా ఆ ప్రభువునే దర్శించారు. వారి మనస్సు తదాకారాన్ని పొందింది. వారి భక్తి అపారమైనది. లోకంబులు లోకేశులు, లోకస్థులను దాటి పెంజీకటి కావల ప్రకాశించేవాడే పరమాత్ముడు, గురుమూర్తి. మానవుడు లోకంబులు, లోకేశులు దాటివెళ్తే కదా. పోనీ వీటిని దాటినా పెంజీకటిని దాటాలి కదా! అదే అజ్ఞానము. గురువు అనుగ్రహము లేనిదే దానిని దాటలేడు.

మీకు ఒక ఉదాహరణ చెప్తాను. ఒక పిల్లవాడిని పిలిచి ఒక సంచీ, డబ్బులూ ఇచ్చి 'నాయానా! జాగ్రత్తగా వెళ్ళి కూరగాయలు తె'మ్మని మార్కెట్టుకి పంపుతాడు తండ్రి. వెళ్ళేటప్పుడు పిల్లవాడిని హెచ్చరిస్తాడు, "రోడ్డుమీద జాగ్రత్తగా వెళ్ళు, బస్సులు, కార్లు వస్తూ పోతూ ఉంటాయి" అంటాడు. ఆ పిల్లవాడు తండ్రి చెప్పిన మాట వినక ప్రమాదానికి గురి అయ్యాడనుకోండి. ఆ తప్పు తండ్రిదా ? పిల్లవాడిదా? మానవునికి అనుక్షణం తాను చేసే తప్పును హెచ్చరించే బుద్ధి ఇంద్రియమును ఒకదానిని భగవానుడు ప్రసాదించాడు. అయినా వాడు ఆ బుద్ధి చేసిన హెచ్చరికను లెక్క చేయడనుకోండి. ఆ తప్పు ఎవరిది? ఏదైనా జరగకూడనిది జరిగితే ఇది నా

ప్రారబ్ధఖర్మ అని తనను నిందించుకొనక భగవానుని నిందిస్తే ఏం లాభం? కాబట్టి గురుదేవుని యందు అచంచల విశ్వాసము కలిగి ఉండాలి.

గురుదేవులను ఎప్పుడూ మానవుడనే దృష్టితో చూడరాదు. గురువు విషయంలో ద్వైతము పనికిరాదు. పుత్రుడి చదువు పూర్తి అవుతుంది. పెద్ద ఉద్యోగంలో ఉంటాడు. తండ్రి ఆస్తికంతకూ తానే వారసుడు. ఆ తండ్రికి పుత్రుడంటే అమిత వాత్సల్యం. ఆ పుత్రుడు తాను ఎంత హోదాలో ఉన్నా తన తండ్రికి గౌరవం యివ్వవలసిందేకదా! తన తండ్రిని "ఏరా నాన్నా!" అని పిలువగలుగుతాడా? తండ్రి ఎదురుగా కూర్చొని నేను నీ ఆస్తికి వారసుడిని అని చెప్పి ఆ తండ్రి సమక్షంలో సిగరెట్టు కాలుస్తూ తండ్రిని అవమానపరచటం లోక సమ్మతమేనా? తండ్రి జీవించి ఉన్నంతవరకూ తండ్రి స్థానానికి గౌరవం ఇవ్వవలసిందే" అన్నారు శ్రీ బాబూజీ.

"అక్షరజ్ఞానము లేనివాడికి అక్షరాలలో ఉన్న విలువ ఏం తెలుస్తుంది? అక్షరస్వరూపుడిని ఎలా తెలుసుకుంటాడు? అసలు నేనెవరిని? అని ప్రశ్నించుకోవాలి. ఆ ప్రశ్నకు సమాధానం దొరికితే ఇక ప్రశ్న అన్నది వుదయించదు. అట్టి స్థితినే పూర్ణస్థితి అంటారు. జ్ఞాని ఎప్పుడూ ఆస్థితిలోనే వుంటాడు. జ్ఞానిని జ్ఞాని మాత్రమే తెలుసుకోగలుగుతాడు. జ్ఞాని అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు ఉంటాడు. కానీ ఏమీ తెలియకపోయినా నాకు అన్నీ తెలుసు అని అనుకుంటాడు అజ్ఞాని" అన్నారు శ్రీ బాబూజీ.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జనవరి 2024 :*** AS 2424, 6373, 6421, 7217, 7963, 7975 - 7979, 7982, 7983, 7986, 7988, 9196 - 9199, 9201; LM 4404 - 4407

***ఫిబ్రవరి 2024 :*** AS 6554, 7236, 7996, 8362, 8632, 8968, 9204, 9205, 9207 - 9210; LM 4408, 4409, 4415

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***దైవాన్ని దర్శింపజేసేవాడు - గురువు***

"ప్రపంచంలోని జీవులందరికీ యే యితర సంబంధములైనా లేకపోవచ్చు గానీ, మాతృ సంబంధం లేకుండా ఎవ్వరూ వుండరు. మనకి మన కన్నతల్లే మొట్టమొదటి గురువు. ఆవిడ నిండుహృదయంతో మనకేమైనా నేర్పిస్తేనే మనకి తెలిసేది. ఆ తరువాత మన తండ్రి, పాఠశాలలోని ఉపాధ్యయులు మనకి గురువులై ప్రపంచజ్ఞానాన్ని నేర్పిస్తారు. మన తల్లిదండ్రులు మనకి దేవతా ప్రతిరూపాలని చూపి 'ఈయన రాముడు, ఈయన కృష్ణుడు' అని నేర్పిస్తారు. మెల్లగా మనలో 'దైవచింతన' అనే బీజాన్ని నాటుతారు. కానీ ఆ రాముడి యొక్క, కృష్ణుడి యొక్క అసలయిన తత్వాన్ని మనకి తెలిపేటివారు సమర్థులైన సత్య గురుదేవులు మాత్రమే.



దైవత్వాన్ని దర్శింపచేసేటి వాడు గురువు. మానవాకారంతోనే వచ్చి, మన మధ్యనే మెలుగుతూ మనని తరింపజేస్తాడాయన. 'అమ్మ' యొక్క నిజతత్వాన్ని తెలిపేటి వాడు గురువు. 'అ' అంటే బ్రహ్మబీజం, 'మ' అంటే అమృతబీజం. కనుక బ్రహ్మామృతాన్ని అందించేది 'అమ్మ'. లలితా సహస్రనామాలలో 'శ్రీ గురు రూపిణీ' అని కూడా వర్ణించారు.

**గుకారశ్చాంధకారస్తు। రుకారస్తన్నిరోధకృత్।**

**అంధకార వినాశిత్వాత్। గురురిత్య భిధీయతే।**

అని గురుగీత చెబుతున్నది. - 'గు' అంటే అజ్ఞానాంధకారము. 'రు' అంటే తేజస్సు. కనుక మనలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞానభాస్కర కిరణాలని వెదజల్లే వాడే గురువు. మనలోని నానాత్వంతో కూడిన మానవత్వాన్ని, ఏకత్వమైన మాధవస్వరూపంగా మారుస్తాడాయన. అటువంటి గురుమూర్తిని సామాన్య నరునిగా ఎంచితే, మనకా బ్రహ్మతత్వం తెలియదు. మనము నమ్మి ఆశ్రయించిన గురుమూర్తిని సర్వదేవతా స్వరూపునిగా ఎంచి, ఆయనయందు అచంచల విశ్వాసము కలిగి, చతుర్విధ శుశ్రూషలతో సేవించి,

వారి ఆజ్ఞను తు.చ. తప్పకుండా పాలించిననాడు, ఆయన మనని శాశ్వతానంద బ్రహ్మస్వరూపులుగా తీర్చిదిద్దుతారు. ఆనాడు మన తల్లిదండ్రులు మనకి పటాలలో చూపిన దేవుళ్ళ యొక్క సర్వాంతర్యామిత్వాన్ని, సర్వ వ్యాపకత్వాన్ని సద్గురుదేవులు మనకి ప్రత్యక్షంగా అనుభూత మొనరుస్తారన్న దానికి నిదర్శనం మనకి, భక్త తులసీదాసు చరిత్ర ద్వారా విదితమవుతున్నది.

తులసీదాసు యొక్క గురుమూర్తి సాక్షాత్తు ఆంజనేయస్వామియే. జితేంద్రియుడి ద్వారానే ఉపదేశం పొందిన మహనీయుడు తులసీదాసు.

శ్రీరామచంద్రుడికి ఆతిధ్యమిచ్చి సేవించుకోవాలనే కోరిక కలిగి, తులసీదాసు తన గురుమూర్తియైన మారుతిని కోరుతాడు. మారుతి వెళ్ళి రామునికి తులసీదాసు కోరికను తెలిపి, అతడిననుగ్రహించమని వేడుకుంటాడు. రాముడంగీకరించి, తులసీదాసు చేస్తున్న సమారాధన స్థలానికి, ఒక పందిరూపంలో వెళ్ళి, ఆ విస్తళ్ళనన్నింటినీ త్రొక్కుకుంటూ నానా భీభత్సం చేస్తుంటే, తులసీదాసు ఆ వరాహ రూపంలో వున్న రాముడిని కొట్టి, తరిమి వేస్తాడు. పైగా, సమయం దాటినా రాముడు రాలేదే అని దుఃఖించి మారుతికి విన్నవిస్తాడు. మారుతి వెళ్ళి మళ్ళీ రాముడిని ప్రార్థిస్తే, తాను వెళ్ళినా కూడా తులసీదాసు తనను గుర్తించకుండా తనకి చేసిన బడితపూజకి "నిదర్శనాలయిన వాతలని" మారుతికి చూపెడతాడు శ్రీరామచంద్రుడు. రాముడంటే దశరథ తనయుడు, చారు తులసీదళదాముడు కాదు; రాముడంటే సర్వులనీ రమింప చేసేవాడు, నిర్వికారుడు, నిరంజనుడు, సర్వ జీవులలోనూ ప్రకాశించేటివాడు అని, రాముని యొక్క నిజతత్వాన్ని తులసీదాసు కేవలం గురువనుగ్రహం వల్లనే తెలుసుకుంటాడు.

లౌకిక విద్యలను నేర్వడానికే మనకి గురువులవసరమే. మరి అధ్యాత్మ విద్య నేర్చుకుని, మన యొక్క నిజతత్వాన్ని తెలుసుకోవడానికి సమర్థులైన సత్య గురుదేవులనాశ్రయించి, వారి యందు అచంచల విశ్వాసం కలిగి వుండి, వారి ఆజ్ఞను తు.చ. తప్పకుండా ఆచరించాలి. అట్టి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, ప్రసాదించి గురుపాదుకలు సర్వులను కాపాడుగాక!

# పాజిటివ్ థింకింగ్

సేకరణ - బొంబాయి కృష్ణారావు

ఒక్కొక్కడిది ఒక్కొక్క బాధ. మహాభారతంలోని ప్రముఖులైన ఇద్దరు మహోన్నతులు కృష్ణుడు, కర్ణుడు మధ్యన ఒకసారి మంచి చర్చ జరిగింది...

కర్ణుడు కృష్ణుడిని అడిగాడు, 'నేను పుట్టీపుట్టగానే నన్ను నా తల్లి వదిలేసింది. అశాస్త్రీయమైన జన్మను పొందడం అనేది నా తప్పా? కాదే! ద్రోణాచార్యులు నాకు విద్య నేర్పేటందుకు నిరాకరించారు. ఎందుకంటే నేను క్షత్రియుని కాను అన్న కారణంతో. పరశురాముడు నాకు విద్యనైతే నేర్పారు కానీ, నేను క్షత్రియుడిగా గుర్తింపబడేవరకూ ఆ విద్యనంతా మరిచిపోయేలా నాకు శాపం పెట్టారు. పొరపాటున నా బాణం ఒక ఆవుకి తగిలితే ఆ ఆవు యజమాని నా తప్పు లేకున్నా నన్ను నిందించారు. ద్రౌపదీ స్వయంవరంలో నాకు పరాభవం జరిగింది. ఈనాడు కుంతీమాత వచ్చి నేను తన పుత్రుడిని అని నాకు నిజం చెప్పటం వెనకనున్న కారణం కేవలం ఆవిడ తన వేరే పుత్రులను కాపాడుకోవటం కోసమే. నేనంటూ ఏదన్నా పొందాను అంటే అది దుర్యోధనుని దయాధర్మం వల్లనే! అలాంటప్పుడు నేను దుర్యోధనుని పక్షాన ఉండటం తప్పెలా అవుతుంది?' అని అన్నాడు కర్ణుడు.

దానికి కృష్ణుడు సమాధానంగా కర్ణునికి చెప్పాడు... 'నేను పుట్టటమే కారాగారంలో పుట్టాను. నేను పుట్టటం కంటే ముందే నా చావు నాకోసం కాచుకుని కూర్చుంది. నేను పుట్టిన రాత్రే నా కన్న తల్లి తండ్రి నుండి వేరు చేయబడ్డాను. చిన్నతనంలో నువ్వు కత్తులు, రధాలు, బాణాలు, గుర్రాలు ఇలాంటి శబ్దాల మధ్య పెరిగావు. నేను గోశాలలో పేడ వాసనల మధ్యన ఉన్నాను. నా చిన్నతనంలో నన్ను చంపేందుకు నా పైన ఎన్నో దాడులు జరిగాయి. అప్పటికి నాకు నడిచే వయసు కూడా రాలేదు. కానీ ఎన్నో దాడులు ఎదుర్కొన్నాను. నా చుట్టూ వున్న వారు వారి సమస్యలకు నేనే కారణం అని నన్ను నిందించేవారు కూడా. నాకు సైన్యమూ లేదు, విద్య కూడా లేదు. మీరందరూ మీ విద్యాభ్యాసం పూర్తి చేసుకుని మీ ప్రతిభలకు మీ గురువుల నుంచీ అభినందనలు

పొందే వయసుకి నేను విద్య నేర్చుకునేందుకు నోచుకోలేదు కూడానూ. సాందీపని రుషి వద్ద నా పదహారో ఏట నా చదువు ప్రారంభం అయ్యింది. నువ్వు నీకు ఇష్టమైన అమ్మాయిని వివాహం చేసుకోగలిగావు. నేను నాకిష్టమైన అమ్మాయిని చేసుకోలేకపోయాను. పైగా నన్ను వివాహం చేసుకున్నవారు, వారు నన్ను కోరుకుని కొందరూ, నాచే రాక్షసుల నుండి కాపాడబడినవారు కొందరూనూ. జరాసంధుని బారినుంచి కాపాడుకోవటానికి నా గోకులాన్నంతా నేను యమున ఒడ్డునుంచి దూరంగా తీసుకెళ్ళాల్సివచ్చింది. అప్పుడు పిరికివాడుగా పారిపోయానన్న చెడ్డపేరు నాకొచ్చింది. సరే ఇంతకీ దుర్యోధనుడు ఈ యుద్ధం గెలిచాడే అనుకో నీకు మంచిపేరు వస్తుంది. అదే ధర్మరాజు గెలిస్తే నాకేమీ రాదు. పైగా ఈ యుద్ధం మరియు యుద్ధానికి సంబంధించిన సమస్యలకూ నేనే కారణం అన్న నింద వేస్తారు అందరూ నాపైన.

ఒకటి గుర్తుంచుకో కర్ణా! జీవితంలో సమస్యలు, సవాళ్ళు అందరికీ ఉంటాయి. జీవితం ఏ ఒక్కరికీ పూలబాట కాదు. అన్నివేళలా అంతా సవ్యంగానే ఉండదు. దుర్యోధనుడు కానీ, యుధిష్టిరుడు కానీ అందరూ జీవితపు దెబ్బలు రుచి చూసినవారే. ఏది సరైనదో, ఏది ధర్మమో నీ మనసుకి, నీ బుద్ధికి తెలుసు. మనకు ఎంత అన్యాయం జరిగినా, మనకు ఎన్ని పరాభవాలు జరిగినా, మనకు రావల్సినది మనకు అందకపోయినా, మనం ఆయా సమయాల్లో ఎలా ప్రవర్తిస్తామో అదే మన వ్యక్తిత్వం. అదే చాలా ముఖ్యమైనది.

జీవితం ఆటుపోట్లు భరించామనో, మనకు చెడు అనుభవాలు ఎదురయ్యాయనో, అనే కారణాలు మనకు అధర్మమార్గంలో ప్రయాణించేందుకు అనుమతిగా అనుకోకూడదు. మనం బాధపడ్డామని జీవితాన్ని చెడు మార్గంలోకి నడిపించకూడదు. ఏ పరిస్థితుల్లో అయినా ధర్మాన్ని వదులుకోకూడదు’ అని కర్ణునికి కృష్ణుడు బోధించాడు.

“శ్రీకృష్ణం వందే జగద్గురుం”

# జీవేశ్వరుడు

- పాలూరి కాళీప్రసాద్

వెంకట్రావుకి భక్తి మెండు. పైగా అతనికి ఎలాగైనా చనిపోయిన తరువాత వైకుంఠానికి చేరుకోవాలని కోరిక. భారతదేశంలో అతడు దర్శించని పుణ్యక్షేత్రం లేదు, నీరాడని తీర్థం లేదు. ఎవరు ఏమి చేస్తే పుణ్యం వస్తుందని చెప్పినా అవన్నీ చేసేవాడు. ప్రతి పుణ్యక్షేత్రంలో తన పేర అన్నదానానికి విరాళాలు ఇచ్చాడు. నలుగురిలో గొప్ప పుణ్యాత్ముడనే పేరు తెచ్చుకున్నాడు. ఇలా ఉండగా చివరికి అతనికి అంత్యకాలం సమీపించింది. అయితే తనను తీసుకుపోవడానికి విష్ణుదూతలు వస్తారని ఆశగా ఎదురుచూస్తున్న వెంకట్రావు ఆశ అడియాసే అయ్యింది. ఎదురుగా యమదూతలను చూసి బిక్కచచ్చిపోయాడు.

చేసేదేమీ లేక వారితో బయలుదేరాడు. ఆ ప్రయాణం సుదీర్ఘంగా సాగుతోంది. కొంత సమయం గడిచాక ఎలాగో మెల్లగా ధైర్యం కూడదీసుకొని ఆ యమదూతలతో మాట కలిపాడు. "అయ్యా! నేను నా జీవితమంతా ఎన్నో పుణ్యకార్యాలు చేశాను. గొప్ప పుణ్యాత్ముడిగా పేరు గడించాను. **'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి'** అని నమ్మి కనబడిన దేవునికల్లా మ్రొక్కాను. ఈ చేసిన పుణ్యకార్యాలకు నారాయణుడు ఎంతగానో సంతోషించి నన్ను వైకుంఠానికి తీసుకెళతాడని నేను విష్ణుదూతలకోసం నిరీక్షిస్తుంటే తీరా మీరు వచ్చారు. దయచేసి నేను చేసిన తప్పేమిటో సెలవిస్తారా?" అని భయపడుతూనే ప్రశ్నించాడు.

దానికా యమదూతలు పెద్దగా నవ్వుతూ "చూడు నాయనా! నువ్వు చెప్పినదంతా నిజమే. నువ్వు చాలా పుణ్యకార్యాలు చేశావు. అయితే అంతకంటే ఎక్కువే పాపాలు చేశావు. అందుకే నిన్ను ముందుగా నరకానికి తీసుకువెళ్ళడం జరుగుతోంది. నువ్వు అనేక పుణ్యక్షేత్రాలు తిరిగావు. అక్కడి విగ్రహాలలో, నదులలో భగవంతుని చూడటానికి ప్రయత్నించావు, కానీ ఏనాడైనా నీ చుట్టూ ఉన్న మనుష్యులలో, ఇతర ప్రాణులలో భగవంతుడు ఉన్నాడని గుర్తించావా? ఏ క్షేత్రానికి వెళ్ళినా నీ మనస్సు ఎంతసేపూ పూజల చుట్టూ, స్నానాల చుట్టూ తిరుగుతూ వుండేది తప్ప, అక్కడ నీకు ఎదురైన దీనజనులకు నీ చేతనైన సహాయం చేయడానికి ఎప్పుడైనా ప్రయత్నించావా? పైగా ఎవరైనా సహాయం

అర్థిస్తే వారిని అనుమానంతో చూడటమే కాక, చీదరించుకునే వాడివి, గుర్తుందా?

ఎన్నో క్షేత్రాలలో అన్నదానానికి విరాళాలు ఇచ్చావు కానీ, అవన్నీ కేవలం పుణ్యం సంపాదించుకోవడానికే తప్ప అన్నార్తుల మీద జాలితో కాదు. నీ ఇంటికి ఎవరైనా బిచ్చగాడు వచ్చినా వారిని అసహ్యించు కుంటూ, తప్పదని దూరంనుంచే ఎంతో కొంత విసిరి వేసేవాడివి కానీ ఇస్తున్నది నారాయణుడికనే భక్తితో, వినయంతో ఎప్పుడైనా దానం చేశావా? నీ అవసరానికి చెప్పులు కుట్టించుకొని, కనీసం అందుకు మూల్యాన్ని అతనికి మర్యాదగా చెల్లించకుండా, నేలమీద విసిరేసి వెళ్లిపోయేవాడివి. ఎందుకంటే అలాంటి వారిని ముట్టుకోవాలంటేనే నీకు అసహ్యం. దివ్య క్షేత్రాలకు వెళ్ళినా అక్కడ సహపంక్తి భోజనాలు చేయడానికి నీకు చిరాకు. నీ ఇంటిలోనే పనిచేసే పని మనుషులను ఏనాడూ మనుషులుగా చూడలేదు.

బంధువులకు, స్నేహితులకు గొప్పకోసం మళ్ళీ మళ్ళీ క్రొత్త బట్టలు పెడుతూ ఉండేవాడివి కానీ, ఎవరైనా లేనివారు వచ్చి ఒక పాత బట్ట ఇవ్వమంటే చీదరించుకునే వాడివి. పెద్ద ఇల్లైతే కట్టుకున్నావు కానీ వర్షానికి భయపడి నీ వసారాలోకి ఏ కుక్కో వస్తే దాని కాళ్ళు విరగగొట్టే వాడివి. ఇలా అనేక దీనజీవుల పట్ల అసహ్యాన్ని ప్రదర్శిస్తూ పాపాన్ని పోగేసుకున్నావు. **'సర్వ దేవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి'** అని నమ్మావు కానీ **'సర్వ జీవ తిరస్కారం కేశవం ప్రతి గచ్ఛతి'** అని తెలుసుకోలేకపోయావు. నువ్వు నమ్మిన ఆ నారాయణుడే స్వయంగా **'సర్వస్య చాऽహం హృది సన్నివిష్టః'**, **'ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్టతి'** అని చాటి చెప్పాడు కదా! భగవంతుడికి తనకు పూజలు చేసే వారికన్నా ఇతర జీవులకు సేవ చేసేవారు అంటేనే ఎక్కువ ఇష్టం. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి వచ్చే జన్మలోనైనా సర్వ జీవకోటిలో ప్రకాశిస్తున్న జీవేశ్వరుని దర్శించి సేవించే ప్రయత్నం చెయ్యి. అప్పుడు నువ్వెక్కడ ఉంటే అదే వైకుంఠం అవుతుంది" అని ప్రబోధించారు.

# శ్రీ గణేశతత్త్వం

డా॥ వారణాసి శివరామకృష్ణ

భారతదేశం కర్మభూమి. దేవతలు, మహర్షులు నిరంతరం సంచరించే ప్రాంతం. ముక్తిని ప్రసాదించి, సకల భక్తులను తరింపజేసే పవిత్ర పుణ్యతీర్థాలు, నదులు, పుణ్య క్షేత్రాలు చక్కగా ప్రకాశిస్తున్నవి. ఆస్తికులయిన భారతీయులు నిత్యపూజా కార్యక్రమాలలోనూ, శుభకార్యాలలోనూ ప్రారంభోత్సవాలలోనూ శ్రీ మహాగణపతిని ప్రప్రథమంగా పూజించటం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ముందుగా శ్రీగణేశ్వర పూజలోని ప్రార్థనాశ్లోక పరమార్థం గూర్చి చర్చించవలసి వున్నది. ఇది పురాతన మహర్షి ప్రోక్తమయిన శ్లోకం. అనుష్టుప్ ఛందస్సులో వుంది.

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే**

ఇందులో ధ్యాయేత్ అనే క్రియాపదం సంస్కృతంలోని విధిలింగ్ ప్రత్యయం చేర్పగా ఏర్పడింది. తప్పక ధ్యానించవలెను అని శాసిస్తోంది. సర్వ విఘ్నములను అణచుటకు (శాంతింపజేయుటకు, తొలగించుటకు) కర్త ఎవరు? విష్ణువు. ఆయన లక్షణాలు 4 చెప్పబడినవి. అవి విష్ణుమూర్తికి, విష్ణుసేనాని అయిన విష్వక్సేనునకు (వైష్ణవ సంప్రదాయం) గణేశ్వరునకు (స్మార్త సంప్రదాయము) చెందుతాయి.

1. **శుక్లాంబరధరుడు** – శ్వేత (తెలుపు, స్వచ్ఛం) వస్త్రధారి. తెల్లని ఆకాశంతో నిండినవాడు. **విశ్వం వేవేష్టి వ్యాప్నోతి ఇతి విష్ణుః** అని అమరకోశార్థం. విశ్వంభరుడు – ప్రపంచం అంతా నిండి వున్నవాడు. 2. **శశివర్ణుడు** – చంద్రుని కాంతి (తెలుపు) గలవాడు. 3. **చతుర్భుజుడు** – నాలుగుచేతులు కలవాడు (దేవతా లక్షణం). చతురమైన (నేర్పరితనం) భుజములు కలవాడు. (మంచి హస్త కౌశలం కలవాడు) 4. **ప్రసన్నవదనం** – ప్రశాంత ముఖము కలవాడు.

అమరకోశములో విఘ్నేశ్వర శ్లోకం వుంది. అష్ట విధ నామాలు –

**వినాయకో విఘ్నరాజ ద్వైమాతుర గణాధిప**
**అప్యేకదన్త హేరంబః లంబోదర గజాననః**

వినాయకునకు షోడశనామాలు, అష్టోత్తర శతనామావళీ, సహస్ర నామావళి ప్రత్యేకించి వున్నాయి. అన్నీ ప్రథమావిభక్తి విశేష్యములే. అపి (కూడా) అవ్యయ పదము. అర్థాలు లింగయసూరి చెప్పినవి:

1. **వినాయకుడు – వినయతి (శిక్షయతి) దుష్టాన్, విఘ్నాంశ్చ** – దుష్టులను, విఘ్నములను శిక్షించేవాడు లేదా **విగతో నాయకః (ప్రభుః) యస్య స్వతంత్రత్వాత్** – తనకున్న స్వేచ్ఛ చేత తనపై అధికారి లేని ప్రభువు.

**2. విఘ్నరాజు – విఘ్నానాం రాజా** – విఘ్నములకు ప్రభువు (అధికారి). దుష్టశిక్షణ, శిష్టరక్షణ రెండు పనులు చేసేవాడు. ఆటంకాలు కలిగించడం, పోగొట్టడం రెండూ చేసేవాడు.

**3. ద్వైమాతురుడు – ద్వయోః మాత్రోః (ఉమా గంగయోః) అపత్యం పుమాన్** – ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డడు. కైలాసంలో పార్వతి నలుగుపిండితో బొమ్మను చేయగా గజశిరస్సుతో పురుషాకారం ఏర్పడింది. గంగలో వేసింది. ప్రాణం వచ్చి పసిబాలుడైనాడు. గంగాదేవి, ఉమాదేవి పెంచారు. (పద్మ పురాణం)

**4. గణాధిపుడు** – శివాజ్ఞచే ప్రమథగణాలకు అధిపతి.

**5. ఏకదంతుడు – పరశురామ ఉత్పాటితైః ఏకదన్తత్వాత్ ఏకదన్తః యస్య సః** – కార్తవీర్యార్జున సంహారం చేసి, పరశురాముడు తన విద్యాగురువయిన పరమేశ్వర దర్శనార్థం కైలాసానికి రాగా, బాలుడు అడ్డగించాడు. పోరాటంలో ఒక దంతం కోల్పోయినాడు. వ్యాసుని మహాభారత రచనకు దానినే లేఖినిగా ఉపయోగించాడు.

**6. హేరంబుడు – హే - రుద్ర సమీపే, రంబతే - తిష్టతి ఇతి హేరంబః** – పంచశరత్ వయస్కుడై (అయిదేండ్ల బాలుడై) శివపార్వతుల ఒడిలో ఆడుకునేవాడు. లేదా **హేరత - వర్ధయతి భక్తాన్** – భక్తులను వర్ధిల్లజేయువాడు. అష్టోత్తర శతనామావళిలో **శైలేంద్రతనుజోత్సంగ ఖేలనోత్సుంగ మానసాయ** – అనే నామం దీనికి ప్రోద్బలంగా వుంది.

**7. లంబోదరుడు – లంబముదరం యస్య సః** – వ్రేలాడుచున్న బొజ్జగలవాడు. సూరి చెప్పిన వివరణ తప్పు. దానినే లోకులు పాటిస్తున్నారు. ఈశ్వరుడు త్రిశూలంతో ఖండించినది బాలుని శిరస్సు మాత్రమే (శివపురాణం). బాలుని శరీరం బహు సుందరం. పార్వతి సృష్టి. లంబం అనగా వ్రేలాడటమే కాదు. దీర్ఘం (పొడవు, నిట్టనిలువు) అనే అర్థం వుంది. సమతలంగా వున్న ఉదరం (పొట్ట) కలవాడు. **తలోదరి** – సూక్ష్మమైన ఉదరము కల ఆడది.

**8. గజాననుడు – గజస్య ఏన ఆననం యస్య సః** – ఏనుగు ముఖం కలవాడు. గ – గతి, జ– పుట్టుట. సృష్టి, స్థితి, లయాలు త్రిమూర్తులతో సమానంగా నిర్వహించేవాడు.

గణపతి మంత్ర బీజాక్షరం గం జ్ఞానప్రతీకగా గజం సృష్టించబడింది. వినాయకుని శరీర వర్ణం పసుపు, తెలుపు, ఎరుపు (సిందూర వర్ణం). ప్రధాన ఆయుధం పరశువు (గండ్ర గొడ్డలి). బ్రహ్మచారి – సిద్ధి బుద్ధులు ఆయన శక్తులు, భార్యలు కారు. అయిదేండ్ల బాలునిగా వుండే వరం పార్వతీపరమేశ్వరులే ఇచ్చారు. గృహాలలోనూ, భవనాలలోనూ దిష్టిబొమ్మగా గణపతిని ఉంచరాదు. ప్రథమ పూజార్హుడు, గౌరవనీయుడు, గణములకు నాయకుడు దిష్టిబొమ్మగా వుండే పరిస్థితి లేదు. ప్రతిమలను, చిత్రపటాలను

ద్వారములందు ఉంచరాదు. గణేశ ప్రస్తావన వేదాలలోనూ ఉపనిషత్తులలోనూ పురాణాలలోనూ ఉంది. గణేశ పురాణం ప్రత్యేకించి వుంది. పద్మ, లింగ, శివ, బ్రహ్మవైవర్త, ముద్గల, నారద పురాణాలు గణేశ్వర చరిత్రను, మహిమలను తెలుపుచున్నవి. కవులు, వాగ్గేయకారులు తమ కావ్యాలలోనూ, కీర్తనలలోనూ గణపతిని భక్తితో స్తుతించారు. తిరువారూరు ప్రాంతంలోని షోడశ గణేశ్వరులపై ముత్తుస్వామి దీక్షితులు 26 కీర్తనలు రచించాడు. **వాతాపిగణపతిం భజే** కీర్తన ప్రసిద్ధం. సాహిత్యంలో హాస్య రసాధిష్ఠాన దేవత ఆయనే. మూలాధార చక్రంలో కుండలినీ శక్తి ప్రేరకుడు గణపతియే. భారతదేశ పశ్చిమ (అరేబియా) సముద్ర తీరంలో ఉత్తర కర్నాటక ప్రాంతంలోని గోకర్ణ క్షేత్రంలోని మురుడేశ్వర లింగ స్థాపకుడు వినాయకుడే. ఋగ్వేదంలోని గణపతి సూక్తం **ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనా ముపమశ్రవస్తమం జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనః శృణ్వ న్నూతిభిః సీద సాదనం.** గణ ధాతువునకు **సంఖ్యానే** - గణించుట, స్తుతించుట అని అర్థం. స్తుతింపదగిన ప్రభవును ప్రార్థిస్తున్నాము. కవి పండితులకు ప్రశంసార్హుడవు, బ్రహ్మర్షులకు వేదాలకు ముందుండు రక్షకుడవు. మోక్షసదనంలో నివశించు మోక్షప్రదాతవు. ప్రమథ గణనేతవు.

గణపతి అధ్వరశీర్షోపనిషత్ – **నమస్తే గణపతయే త్వమేవ ప్రత్యక్షం తత్వమసి, త్వమేవ కేవలం కర్తాసి, త్వమేవ కేవలం ధర్తాసి, త్వమేవ కేవలం హర్తాసి, త్వం సాక్షాత్ ఆత్మాసి నిత్యం. త్వం మూలాధార స్థితోసి నిత్యం**। భాద్రపద చతుర్థి గణేశ్వరుని జననం – గణేశ చతుర్థి. గణపతి మహిమలు కోకొల్లలు. తన హాస్యరూపం చూసి నవ్విన చంద్రుని గణపతి శపించాడు. వినాయక చతుర్థినాడు తనను పూజిస్తే అపనిందలు రావని అనుగ్రహించాడు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు క్షీరపాత్రలో చంద్రుని చూసి, నీలాపనిందలు భరించి, శమంతకమణి సాధించి, జాంబవతిని, సత్యభామను పెళ్ళిచేసుకున్నాడు. పరశురాముని ఎదిరించి తాను ఏకదంతుడైన కథ వున్నది. విష్ణువు చక్రం మ్రింగిన గణపతిని స్తుతించి, మొట్టికాయలు వేసుకుని నవ్వించి చక్రాన్ని సాధించాడు. ప్రదక్షిణం చేస్తూ నమస్కరించిన బ్రహ్మదేవుని భక్తికి మెచ్చి ఆనంద తాండవం చేశాడు. మధ్యప్రదేశ్‌లో నర్మదా తీరంలో శివుని ఆత్మలింగాన్ని భూమిపై పెట్టించి, బాలకుని వేషంలో రావణుని చెరనుండి శివుని కాపాడాడు. రాముడు అనుగ్రహించిన రంగనాథ విగ్రహాన్ని బాలకుని వేషంలో భూమి మీద పెట్టించి వుభయ కావేరి మధ్యగా శ్రీరంగనాధుని ప్రతిష్ఠకు కారకుడై విభీషణుని అనుగ్రహించాడు. సిద్ధి అనగా విజయం, బుద్ధి అనగా జ్ఞానం ఆయన శక్తులే!

# ఏకాగ్రత

సేకరణ-రెడ్డి శ్రీదేవి

కొత్తగా యోగాభ్యాసం, ధ్యానం నేర్చుకుంటున్న ఒక శిష్యుడు తన గురువుగారితో 'గురువర్యా! నా వల్ల రెండు నిమిషాలు కూడా తదేక చిత్తంతో ధ్యానం చేయడం కుదరడం లేదు, ఏకాగ్రత అనేదే సిద్ధించడంలేదు' అని చెప్పుకుని బాధపడ్డాడు.

ఆ సమయంలో వారు ఒక నది ఒడ్డున వెడుతున్నారు. గురువుగారు వెంటనే కొంచెం దూరంలో నదిలో చేపలు పడుతున్న బెస్తవాడిని చూపించి, అతని వద్దకు పోయి దగ్గరలో అశ్వద్థ వృక్షం ఎక్కడ వున్నదో అడిగి రమ్మన్నాడు. శిష్యుడు అలాగే ఆ చేపలుపట్టే బెస్తవాని వద్దకు వెళ్ళి అడిగాడు.

ఆ బెస్తవాడు ఈ శిష్యుడిని గమనించనే లేదు. తదేకదీక్షతో నదిలో వేసిన గేలాన్నే చూస్తున్న అతను పక్కనున్నదెవరో గమనించనే లేదు. చేపలు పట్టడంలో, అవి తిరిగి జారిపోయి నీళ్ళలోకి వెళ్ళకుండా వాటిని తన బుట్టలో వేసుకోవడంలో పూర్తిగా నిమగ్నమైపోయి ఉన్నాడు. శిష్యుడు తిరిగి తన ప్రశ్నను ఒకటికి రెండుసార్లు గట్టిగా అడుగగా అప్పుడతను తలెత్తి చూసి ఏమడిగారని ప్రశ్నించాడు. తర్వాత శిష్యుడు అడిగినదానికి సమాధానం చెప్పాడు.

తిరిగి వచ్చిన శిష్యునితో గురువుగారు, “నీవు మొదట అడిగినప్పుడు బెస్తవాడు ఎందుకు బదులు యివ్వలేదు?” అని ప్రశ్నించాడు. “స్వామీ, అప్పుడు ఆ బెస్తవాడు మన లోకంలోనే లేడు. నదిలోని చేపలను పట్టే ధ్యాసలో వున్నాడు. నేనడిగినదేదీ అతనికి వినపడనే లేదు” అని అన్నాడు.

అప్పుడు గురువు తన శిష్యునితో “చూశావా ! ధ్యానం అంటే అదే. చేస్తున్న పనిపైనే మనసు పెట్టాలి. చంచలత్వం కూడదు. నీ దృష్టి పూర్తిగా నీవు చేస్తున్న కార్యం పైనే నిలపాలి. నీవు కూడా ఆ బెస్తవాని వలె ఏకాగ్రతతో ఏ కార్యమైనా చెయ్యి. అప్పుడు యోగము, ధ్యానమే కాదు, ఈ లోకమే నీ వశం అవుతుంది” అని గురువుగారు బోధించారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జనవరి 2024**

1 సోమ: ఆంగ్ల సంవత్సరాది - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 శని: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

14 ఆది: భోగి పండుగ - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోయుట. భక్త సమారాధన

15 సోమ: సంక్రాంతి పండుగ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 గురు: పుష్య పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

***22 సోమవారం నుండి 28 ఆదివారం వరకు పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమములు జరుగును***

**ఫిబ్రవరి 2024**

5 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 గురు: మాసశివరాత్రి

9 శుక్ర: అమావాస్య

14 బుధ: మాఘ శుద్ధ పంచమి - వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ

16 శుక్ర: రథసప్తమి

20 మంగళ: మాఘ శుద్ధ ఏకాదశి - భీష్మ ఏకాదశి. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

24 శని : మాఘ పూర్ణిమ - గురు పూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

***** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును*

**జనవరి 2024**

6 శని: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

14 ఆది: భోగి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

15 సోమ: సంక్రాంతి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

25 గురు: పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

**ఫిబ్రవరి 2024**

5 సోమ - శ్రీగరుదశమి - శ్రీ సద్గురుపాదపూజ

20 మంగళ - భీష్మ ఏకాదశి - భక్తసహిత శ్రీసద్గురుమూర్తి ప్రతిష్ఠ

20వ వార్షికోత్సవము, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

24 శని - మాఘ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

## శ్రీ సద్గురు మండల దీక్ష నామ పారాయణ

28-10-23 నుండి 09-12-23 వరకు

**2 కోట్ల, 3లక్షల, 51వేలు - 2,03,51,000**

## శ్రీ సద్గురు పుణ్యారాధన మహోత్సవముల కోటి నామ పారాయణ

30-11-23 నుండి 09-12-23 వరకు

**1 కోటి, 31 లక్షల, 16 వేలు - 1,31,16,000**

## శ్రీ సద్గురు మండల దీక్ష మరియు శ్రీ సద్గురు పుణ్యారాధన మహోత్సవముల కోటి నామ పారాయణ

**3 కోట్ల, 34 లక్షల, 67 వేలు - 3,34,67,000**


దివ్య బరువు
ముకుంద్
కృష్ణమూర్తిగారు వచ్చారు. కూర్చో! కూర్చో!
1
లేదు! లేదు!
2


నా బరువుకి బాబు ఏదో
ఒక నిమిషంలో నన్ను
దిగమంటారు.
3


అదేంటి? ఈయనకు
చీమ కుట్టినట్లైనా
ఉన్నట్లు లేదే?
4


అమ్మో!
ఈయనేమిటి
ఇంత
బరువున్నారు?
5


బాబోయ్! ఒడిలో కొండ
ఉన్నంత బరువుగా ఉంది.
లేవండి బాబా!
6


అదేమిటయ్యా!
అంతసేపు నువ్వు నా
ఒడిలో కూర్చున్నప్పుడు
నాకేమీ తెలియలేదు!
7


ఓ! ఇప్పుడు
గుర్తొచ్చింది.
ద్వాపరయుగంలో
గోవర్ధన గిరిని చిటికిన
వేలు మీద మోసిన నీకు
నా బరువెంత! జై
సద్గురు మహారాజ్ కి జై!
8

# కంచిపరమాచార్య

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

మరలా ఇంకోసారి ఆ కథనంతా వినడానికి భాగీరథి సిద్ధమైంది. ప్రయాణీకులందరూ క్రిందకు దిగిపోయే దాకా ఇద్దరూ సీట్లలోనే కూర్చున్నారు. యాభై అడుగుల దూరం ఎండలో నడిచిన తరువాత ఏసి హాలులోకి వచ్చారు. ఎస్కలేటర్ పనిచేయడం లేదని వ్రాసున్న బోర్డును చూసి వ్యగ్యంగా నవ్వుకున్నాడు శివశంకరన్. "ఈ దేశం తన పేదల ఆకలిని తీర్చి, జనాభాను నియంత్రిస్తే చాలు. ఇంకేం అవసరం లేదు. శాటిలైట్లు, మిసైళ్ళు ఎందుకు?" దేశ సమస్యలకు రెండు వాక్యాలలో సులభమైన పరిష్కారం ఇచ్చేశాడు శివశంకరన్. ఏమీ బదులు చెప్పకుండా నడుస్తోంది భాగీరథి. 'ఇలా చెప్పడం సులభమే కానీ, దాన్ని ఆచరణలో పెట్టడమే పెద్ద సమస్య'. కంచి వెళ్ళేదాకా తను ఇటువంటి చర్చలలో పాల్గొనదల్చలేదు.

హాలులో ఒక ట్రాలీ తీసుకోగా, అది కదలడానికి మొరాయించింది. "ఛీ! భారతదేశంలో కనీసం ఒక ట్రాలీని మంచిగా తయారుచెయ్యలేరా?" 'స్వయంవరంలో' మెల్లిగా నడచివచ్చే రాకుమారిలా కన్వేయర్ బెల్టుపై సామాను వస్తోంది. అప్పుడు ఒక సహాయకుడు దాన్ని అందుకుని, దానిపై వ్రాసిన సంఖ్యను తప్పుగా చెప్పాడు. 'ఎక్స్ క్యూజ్ మి! ఎక్స్ క్యూజ్ మి' అంటూ శివశంకరన్ అతనివైపు పరిగెడుతూ, అతని చెయ్యి పట్టుకున్నాడు. వెంటనే ఆ సహాయకుడు కోపంతో, "ఈ సామాను నీదైతే, చెప్పు. అలాకాక, నాపై చెయ్యి వేశావు అంటే, నేను కూడా నీపై చెయ్యి వెయ్యడానికి ఎంతో సమయం పట్టదు. నువ్వు ధనవంతుడివి అయితే, అది నీ ఇంట్లో వుంచుకో ఇక్కడ నేనే అధికారిని" అన్నాడు.

"ఏమంటున్నావు? ఏమంటున్నావు?" అంటూ శివశంకరన్ ఇటువైపు తిరిగేటప్పటికి మొహం ఎర్రబడిపోయింది. వెంటనే సార్బిట్రేట్ మాత్ర తీసుకుని నోట్లో పెట్టుకున్నాడు. కోపాన్ని భాగీరథిపై మరలుస్తూ, "ఇదంతా నీవల్లే! ఎందుకు నన్ను ఇలా కించపరుస్తున్నావు? నేను భారతదేశానికి రాను, ప్రిన్స్టన్ లోనే ఉంటానని నీకు చెప్పాను. నాకు ఇదంతా ఇష్టం ఉండదు. ఎందుకు నన్ను ఇలా వేధిస్తావు? మద్రాసు

విమానాశ్రయంలో ఒక లోఫర్‌తో నేను ఇలా మాటలు పడాలా?" "రేయ్! ఎవరు లోఫర్ ఇక్కడ? ఒక్క గుద్దు గుద్దానంటే నీ బర్మూడా మొత్తం రక్తసిక్తం అవుతుంది". "రా, వెళ్దాం! ఎందుకు అతనితో గొడవ" అని భాగీరథి పక్కకు లాక్కెళ్లింది. అలాంటి సమయంలో ఎక్కువ మాట్లాడ కూడదని తనకి బాగా తెలుసు. వాళ్ళు బయటకు వచ్చి, తమను తీసుకు వెళ్ళడానికి రావాల్సిన కారు కోసం చూడసాగారు. ఇతర ప్రయాణీకుల కార్లు రావడంతో, వారందరూ వెళ్ళిపోయారు. వెంటనే ఆ ప్రదేశం మొత్తం ఖాళీ అయిపోయింది.

"ఆటో కావాలా? డెబ్బై రూపాయలు మాత్రమే . . . మైలాపూరే కదా?" "నేను ఎక్కడికి వెళ్లాలో నీకెందుకు?" అన్నాడు శివశంకరన్. "ఆయనతో మాట్లాడకు" అంటూ భాగీరథి జోక్యం చేసుకుంది. "నేను ఊరికే అడిగాను మేడమ్. ఎందుకు అలా కోప్పడతారు?" అని ఆటో డ్రైవర్ జవాబిచ్చాడు. అప్పుడు ఒకతను వారి వద్దకు వచ్చి, "మీరు శివరామన్ కదూ?" అని అడిగాడు. "డా. శివశంకర్" "కంచి వెళ్ళాల్సినవారు మీరే కదూ? కారు కోసం ప్రదీపా ట్రావెల్స్ వారిని అడిగారు కదూ?" "అవును" "ఉండండి, నేను కారు తెచ్చాను" "నేను శివరామన్ కాదు" "సరే శివశంకర్, రండి! కారు తెచ్చింది మీకోసమే".

ఆ డ్రైవరుని చూసి భాగీరథి ముచ్చటపడింది. వారి సామాను తీసుకుని కారు వెనకాల పెట్టి, కారు తలుపు తీసి, వారు లోపలకు వెళ్ళి కూర్చున్న తరువాత తలుపు వేసి, వెళ్ళి డ్రైవరు సీట్లో కూర్చున్నాడు. "ఎటువంటి ట్రావెల్ ఏజెంట్స్ వీళ్ళు? కనీసం పేరు కూడా సరిగ్గా చెప్పరా?" "కొన్నిసార్లు ఇటువంటి పొరపాట్లు జరుగుతాయి, టెలెక్స్ సందేశంలో". డ్రైవరు తన మాటలను పూర్తిచెయ్యడానికి శివశంకరన్ వదల్లేదు, "మీ దేశంలో ఏది సరిగ్గా చేస్తారు గనక?"

"డ్రైవర్ నీ పేరేంటి?" అని అడిగింది భాగీరథి. "పాల్ రాజ్, మేడమ్! ఏసి వెయ్యమంటారా? పాటలు పెట్టమంటారా?" ప్లేయరులో ఏదో కాసెట్ పెట్టాడు, "కనులు కనులను దోచాయంటే ప్రేమ అని దానర్థం" అంటూ పాడుతోంది. "నాకు ప్రేమ వద్దు తమ్ముడు" కారు బయలుదేరి వెంటనే ప్రధాన రహదారి పైకి వచ్చింది.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 2 - **సాత్వస్మిన్ పరమ ప్రేమ స్వరూపా**

**సా** - ఆ భక్తి **తు**- అయితే లేక కూడా **అస్మిన్** - దీనియందు **పరమ ప్రేమ స్వరూపా** - పరమ ప్రేమ స్వరూపమై ఉన్నది. "సా" అంటూ నారదుల వారు భక్తిని ఒక మాతృ రూపములో అభివర్ణిస్తున్నారు. జీవాత్మను జగత్పతి అయిన పరమాత్మతో అనుసంధానము చేసే భక్తి మరి సాధకులను ప్రేమతో తీర్చిదిద్దే మాతృ స్వరూపమే కదా! అందుకేనేమో శంకర భగవత్పాదుల వారు కూడా భక్తిని తల్లితో పోలుస్తూ **"భక్తి జననీ భక్తార్థకం రక్షతి"** అంటూ సాధనను పెంచి పోషించ గలిగినది భక్తి మాత్రమే అని తెలియజేశారు.



**"పరమ ప్రేమ స్వరూపా"** అంటూ భక్తిని నిర్వచిస్తూ అది పరమమైన ప్రేమను తెలియజేస్తుందని నారదుల వారు శలవిస్తున్నారు. అంటే భక్తిని గుర్తించగలిగిన స్వరూపము లేక స్వభావము ఉంటే అది కేవలం పరమమైన ప్రేమయే అని అర్థము. ప్రేమ అంటే ప్రీతి భావన. మరి ఆ ప్రీతి భావన సాధారణంగా దేశ కాలాదులను బట్టి మారుతూ ఉంటుంది. మనకు బాల్యంలో ఎంతో ప్రీతిగా ఉన్న వస్తువులు కాలక్రమేణా అంతే ప్రీతిగా ఉండాలని లేదు. అలాగే వ్యక్తుల మీద ఉన్న ప్రేమలకు కూడా కాలానుగుణముగా మార్పు రావడం సహజం కదా. పరమ ప్రేమ అంటే ఆ గురుదేవుని (భగవానుని) ఎడల చూపే అనన్యమైన ప్రీతిగా గుర్తించాలి. ఇది బాహ్యంగా ఎంచబడే ప్రేమలకంటే భిన్నమని తెలియజేయడానికే నారదులు "తు" అన్న అక్షరముతో "అయితే" లేక "కూడా" అన్న భావములో ఉపయోగించారు. అయితే దీనిని లౌకికమైన ప్రేమ వలె కాక స్వచ్ఛమైన, శాశ్వతమైన ప్రేమగా గుర్తించాలి. భక్తి రసామృత సింధువు లో భక్తిని గురించి వివరిస్తూ **"అన్యాభిలాషితా శూన్యం - జ్ఞాన కర్మాదనావృతం - ఆనుకూల్యేన కృష్ణనుశీలనా భక్తిరత్తమా"** అంటూ పరమమైన భక్తిలో మరొక దానిని కోరుకోవడం ఉండదనీ, తన గురుదేవునితో అనుకూలముగా, అనుశీలనముగా వుండటమే

వుత్తమమైన భక్తి అని వివరిస్తారు. పరమ ప్రేమ ఎన్నటికీ శాశ్వతమై, సర్వోన్నతమై, సర్వోత్కృష్టమై ఉంటుంది. అంతేకాక అందులో అహంకారము కానీ, స్వలాభము కానీ, భయము కానీ ఉండవు. సర్వత్రా తన గురుదేవులని దర్శించగలిగిన వాడికి జగత్తంతా పరమ ప్రేమ మయమై కనిపిస్తుంది కదా. అలాంటప్పుడు భయానికీ, అహంకారానికీ తావెక్కడ ఉంటుంది?

ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీ బాబూజీ మహారాజ్ "గురుదేవుడు నిర్హేతుక జాయమాన కరుణా సముద్రుడనీ అందరి యెడల అవ్యాజమైన ప్రేమను చూపిస్తారని" బోధించారు. మరి ఆ గురుదేవుని పట్ల మనం చూపించవలసినది కూడా కళంక రహితమైన ప్రేమ అని ఆయనే శెలవిచ్చారు. వారి యెడల ఆ పరమ ప్రేమను చూపడమే భక్తి కదా మరి! వివేక చూడామణిలో కూడా భక్తిని మోక్ష సాధనకు పనికి వచ్చే అత్యుత్తమ సామగ్రిగానూ స్వస్వరూప అనుసంధానమునకు దోహదపడే సాధనముగానూ నిర్వచించారు.

నారదుల వారు ఈ సూత్రములో "అస్మిన్" అంటూ "దీని యందు" అని తెలియజేస్తున్నారు పరమ ప్రేమను చూపడానికి భగవంతుడు ఎక్కడ ఉన్నాడన్న ఆలోచనకు భగవంతుని యొక్క సర్వవ్యాపకతను బలపరుస్తూ ఆయన ఇక్కడే ఉన్నాడన్న భావముతో దీనిని గ్రహించవచ్చు. "నీ శ్రీహరి ఎక్కడ" అంటూ ప్రశ్నించిన హిరణ్యకశిపుని ప్రశ్నకు సమాధానముగా ప్రహ్లాదుడు "ఇక్కడే ఉన్నాడ"ని స్తంభములో చూపించిన వైనమును ఇది గుర్తుకు తెస్తుంది. భగవంతుడు కృత, త్రేతా, ద్వాపర యుగములలోనే కాక కలి యుగములో కూడా గురుదేవుని అవతారములో ప్రకాశిస్తున్నారని ఇది తెలియజేస్తుంది. అంతేకాక "అస్మిన్" అన్న ప్రస్తావన వర్తమానమునకు కూడా ఆపాదించుకొని త్రికాల అబాధితమైన పరమాత్మ తత్వమును ప్రతిపాదిస్తుంది.

ఈ విధముగా రెండవదయిన ఈ సూత్రములో భగవంతుడి పట్ల పరమమైన శాశ్వతమైన అచంచలమైన ప్రేమ స్వరూపమునే భక్తిగా నారదుల వారు వర్ణిస్తున్నారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జనవరి 2024**

1 సోమ: ఆంగ్ల సంవత్సరాది - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 శని: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

10 బుధ: మాసశివరాత్రి

11 గురు: అమావాస్య

14 ఆది: భోగి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోయుట. భక్త సమారాధన

15 సోమ: సంక్రాంతి పండుగ - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

16 మంగళ: కనుమ పండగ

19 శుక్ర: శ్రీ రామలక్ష్మీ ప్రసాద మాతాజీ వారి ప్రధమ వార్షిక ఆరాధన - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

25 గురు: పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

30 మంగళ: శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

**ఫిబ్రవరి 2024**

5 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 గురు: మాసశివరాత్రి

9 శుక్ర: అమావాస్య

14 బుధ: మాఘ శుద్ధ పంచమి - వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ

16 శుక్ర: రథసప్తమి

20 మంగళ: మాఘ శుద్ధ ఏకాదశి - భీష్మ ఏకాదశి. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

24 శని : మాఘ పూర్ణిమ - గురు పూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి
(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**37. ఇదిగా నిదిగా ననుచు న్మొదలఖిలో పాధులను సమున్నతి ద్రోయం**
**దుది నెవ్వడు చెడకుండుం, జెదరక యా రామచంద్రు జెందుము మనసా.**

తాత్పర్యము: అనేక జన్మలలో అనేక దేహములు ధరించి భౌతిక ఆనందములలో తేలినను శ్రీరామచంద్రుని స్థిరముగా మది నిలుపుకో గలుగునో అదియే తుది జన్మంబని తెలియుము మనసా.

**38. చక్కని వారల లోపల జక్కని వాడరయ మిగుల సరసు డఖిలమున్నెక్కెడు**
**వాడారాముని, నిక్కముగా దెలిసి పొంది నెరయవె మనసా.**

తాత్పర్యము: చక్కని వారల లోపల చక్కని వాడు, ఎంతో సరసుడు, సర్వమూ తనలో నిల్పుకొన్నవాడు అని రాముని తెలుసుకొని నిక్కముగా మది నమ్ముము మనసా.

**39. ఏ పురుషోత్తము డఖిల వ్యాపారము జేయ బనుచు ననుదినమును ని**
**న్నా పరమాత్ముడే తగు సీతాపతి వానినె తలంపు తలగక మనసా.**

తాత్పర్యము: అనుదినము నిన్ను ఆ పరమాత్ముడగు సీతాపతియే నీ సకల కార్యములు చేయించు చున్నాడని తెలిసికొని అతనిని మది స్థిరముగ నిల్పుము మనసా.

**40. పంచేంద్రియముల నినునియ మించి మహాయోగు లేయమేయ మహిము వీ**
**క్షించెద రట్టి నిరంజను, నంచితగతి నాశ్రయింపు మనిశము మనసా.**

తాత్పర్యము: పంచ ఇంద్రియములను నిగ్రహించిన మన యోగులు ఏ అమేయ మహిమను చూసెదరో అటువంటి నిరంజనుని ఎప్పుడూ ఆశ్రయించుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"రాముడు ఇక్కడికి వచ్చి ఇంగుది వృక్షం కింద కూర్చున్నాడు. అప్పుడు నేను ఆయనకి అన్నము, కందమూలాలు, తేనె మొదలైనవి తీసుకువెళ్ళాను, అప్పుడు రాముడు 'నేను క్షత్రియుడిని, ఒకరికి మేము ఇవ్వాలి, ఇతరులనుండి మేము తీసుకోకూడదు. మా తండ్రిగారికి ఇష్టమైన ఆ గుర్రాలకి కొంచెం దాణా పెట్టు. ఆ గంగనుంచి నీళ్ళు తీసుకురా, అవి తాగి పడుకుంటానయ్యా' అన్నాడు. అప్పుడు నేను గంగ నుంచి కొన్ని నీళ్ళు తీసుకువచ్చి వాళ్ళకి ఇచ్చాను. సీతారాములు తాగగా మిగిలిన నీళ్ళని లక్ష్మణుడు కళ్ళకి అద్దుకొని తాగాడు. అప్పుడు నేను రాముడిని లోపల హంసతూలికా తల్పం మీద పడుకోమనగా, ఆయన, నేను ఇప్పుడు ఒక తాపసిలాగ బ్రతకాలి అని చెప్పి, లక్ష్మణుడు తీసుకొచ్చిన దర్భగడ్డి మీద పడుకున్నాడు. రాముడు పడుకోబోయేముందు, లక్ష్మణుడు సీతారాముల పాదములు కడిగి, తడిగుడ్డతో తుడిచాడు. అప్పుడు సీతమ్మ రాముడి భుజాన్ని తలగడగా చేసుకొని పడుకుంది. 'నేను కాపలా కాస్తాను నువ్వు పడుకో లక్ష్మణా!' అంటే, ఆయన 'నన్ను ఎలా పడుకోమంటావు గుహా! ఇంత దారుణమైన దృశ్యం చూశాక?', అని నీ తమ్ముడు లక్ష్మణుడు ఏడిచాడయ్యా. ఇదుగో ఈ గడ్డి మీదే సీతారాములు పడుకున్నారు" అని గుహుడు సీతారాములు పడుకున్న గడ్డిని భరతుడికి చూపించాడు. అప్పుడు భరతుడు, సీతారాములు పడుకున్న ఆ గడ్డి దగ్గరికి వెళ్ళి చూడగా, ఒకవైపు గట్టిగా ఒత్తుకొని, గడ్డి భూమిలోకి నొక్కుకొని ఉంది. ఇది రాముడు పడుకున్న చోటని భరతుడు గ్రహించాడు.

**మన్యే సాభరణా సుప్తా సీతా అస్మిన్ శయనే తదా।**
**తత్ర తత్ర హి దృశ్యంతే సక్తాః కనక బిందవః॥**

అలాగే, సీతమ్మ పడుకున్న వైపు బంగారు రవ్వలు పడి ఉన్నాయి. సీతమ్మ కట్టుకున్న పట్టుచీర కొంగు యొక్క దారములు ఆ గడ్డికి చుట్టుకొని ఉన్నాయి. ఎక్కడో రాజభవనాల్లో పడుకోవలసిన

సీతారాములు, ఇంతమంది ఆటవికులు చూస్తుండగా గడ్డిమీద పడుకోవలసి వచ్చిందని, తెలుసుకొనిన భరతశత్రుఘ్నుల కళ్ళు చెమర్చాయి. పిదప రాముడు, సీత, చిన్నవాడైన లక్ష్మణుడు ముగ్గురూ చిత్రకూటమందున్నారని గుహుడు తెలియజేయ, వారందరూ కళ్ళనిండుగ చెమర్చిన కన్నీటిని తుడుచుకుంటూ అచ్చోటకు బయలుదేరారు.

చిత్రకూటమందు లక్ష్మణుడు, పెద్ద సైన్యముతో భరతుడు వచ్చుటను గమనించి, ముఖమందు ఆగ్రహము ఉప్పొంగ, అన్న రామునితో, "చూశారా! అన్నా! పులితల్లి ఎనిమిదడుగులు దుముకుతే దాని పిల్ల పదహారు అడుగులు దుముకుతుంది అనునట్లు కైకేయి కూర్చిపెట్టిన రాజ్యము చాలదన్నట్లు భరతుడు మనతో పోరాడ సైన్యమును సమకూర్చుకుని వచ్చుచున్నాడు. నాకు అనుమతినిచ్చినచో, వారందరినీ పిండి, పిండి చేసేస్తాను" అన్నాడు.

చిరుమందహాసముతో కూడిన ముఖారవిందముతో రాముడు, "ఓ లక్ష్మణా! భరతుడు కూడ నీవలె నాకు ఒక తమ్ముడు. ఆతడిని సందేహించవలదు. ఆతడు నన్ను మరల అయోధ్యకు తీసుకుని వెళ్ళడానికి ఇచ్చటకు వచ్చుచున్నాడు" అన్నాడు లక్ష్మణునితో. "అన్నా! మీకు తెల్లనివన్నీ పాలు. నాకు భరతుని గురించి చాలా బాగుగా తెలుసును" బదులిచ్చాడు లక్ష్మణుడు.

"అటులనా! అయితే భరతుని రానిమ్ము. ఆతడు గనుక నేను చెప్పినట్లే నన్ను అయోధ్యకు పిలిచినట్లైతే, తమ్ముడా! వనవాసం నాకు మాత్రమే. కావున నాకు బదులుగ లక్ష్మణుని తీసుకుని వెళ్ళి, పట్టాభిషేక మొనరింపుము' అని నేను భరతుని కోరెదను. అప్పుడు నీకు భరతుని హృదయమందున్న విషయము అర్థమగును" అన్నాడు రాముడు. రాముని మాటలను వినిన లక్ష్మణుడు సిగ్గుతో తలదించుకున్నాడు. భరతాదులంతా వచ్చిన వెంటనే అయోధ్యనగర విషయములన్నింటినీ ప్రశ్నించి తెలుసుకొనిన రాముడు, తన కన్నతండ్రి మరణవార్తను తెలుసుకొని చింతించాడు.

- సశేషం

# జ్ఞాన సముపార్జన

- ఎన్. కుట్టి

"నేను ఈ దేహము కాదు, నేను ఆత్మను " అని తెలుసుకోవటమే మోక్షము. ఇది చెప్పినంత సులభము కాదు. సమిత్పాణియై సమర్థులైన సద్గురువులను ఆశ్రయించినచో వారు మన సందేహములన్నిటినీ తీర్చి జ్ఞాన మార్గంలో నడిపిస్తారు.

ఆత్మ నిష్కళం (కళంకము లేనిది); నిరంజనం (రాగ ద్వేషములు) లేనిది; నిష్క్రియం(కర్మ లేనిది); నిరవద్యము (విడదీయలేనిది); సాక్షి ( సాక్షీ మాత్రము). దీనినే చేతన, లేక కేవల స్వరూపమని చెబుతారు. దేహాదులు, మనస్సు, బుద్ధి కానిది ఆత్మ. "నేను ఇది కాదు, ఇది కాదు, (నేతి నేతి) అని నిరసిస్తూపోతే మిగిలేదే ఆత్మ" అని శ్రీ రమణమహర్షి బోధించినారు. ఈ సాధనకు అధికారి సాధన చతుష్టయములను (నిత్యానిత్య వివేకము, ఇహ అముత్రాది ఫల భోగ విరాగము, శమాది షట్క సంపత్తి (శమము, దమము, వుపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానములు), మోక్షేచ్ఛ పొంది వుండాలి.

సద్గురువుని ఆశ్రయించటం ఎలా? "నీ సాధన పరిపక్వ మైనప్పుడు సద్గురువే నిన్ను వెదుక్కుంటూ వస్తాడు" అని శ్రీ బాబూజీ మహరాజ్ వారు బోధించారు. ఆ విధముగానే శ్రీ వివేకానందులు బ్రహ్మానందులు గురుదేవులైన శ్రీ రామకృష్ణ పరమహంస అనుగ్రహము చేతనే ఆయన ప్రియ శిష్యులైనారు. ఇంటి కప్పు పైకి ఎక్కి "నా శిష్యులారా రండి, రండి!" అని రోజూ పిలిచేవారు.

అలాంటి సద్గురువులు లభించినప్పుడు మనం ఏం చేయాలి? సద్గురువులకు చతుర్విధ శుశ్రూషలు (అర్థ, అంగ, స్థాన, ఆత్మ శుశ్రూషలు) చేయాలి. వారి ఎడల అచంచల, అకుంఠిత శ్రద్ధా భక్తులను పెంపొందించుకోవాలి. గురువాజ్ఞను తు.చ. తప్పక పాటించాలి. ఇది ముక్తికి సులువైన మార్గము. అలా సాధన చేసినవారికి విషయాదుల పట్ల వైరాగ్యము ఏర్పడుతుంది. అతని మనస్సు ఆత్మ విచారణలో మునిగిపోతుంది. ఆహార విహారాలపట్ల ఆసక్తి ఉండదు. అట్టి స్థితిలో అతడు ఆత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు.

ధర్మాచరణము, నిషిద్ధ కర్మలు చేయకుండుట, సత్ప్రవర్తనము, బ్రహ్మ చర్యము మన సాధనకు తోడ్పడతాయి. శ్రీ సద్గురు దేవుల అనుగ్రహంతో జీవన్ముక్తిని అతడు పొందుతాడు.

(గత సంచిక తరువాయి)

# బిచ్చగాడు

కానీ ఒకటి మాత్రం అందరూ చెప్తున్నది ఈయనే గురువు నాకు. మా గురువు గారు కాశీ వెళ్ళమని చెప్పారు. అందుకే ఇక్కడ వేదాదులు అధ్యయనం చేశాను. ఇలా అనేక మంది అనేక విషయాలు చెప్తున్నారు. మన "కరపాత్ర స్వామీజీకి" అర్థం కాని విషయాలు రెండు. ఇంతకీ 1) కరపాత్ర స్వామిజీ ఎవరు? ఇన్నాళ్లు కాశీలో వుండి వారిని దర్శించుకోలేక పోయాను. ఎంత దౌర్భాగ్యుణ్ణి! 2) నాకు గురువు ఎవరు? ఈ రెండు ప్రశ్నలు ఆయన బాధిస్తున్నా అక్కడికొచ్చే వారికి ఏమిచెప్పాలో తెలియక భగవదనుగ్రహంతో ఏవో చెప్పేసి నాకు భిక్షా సమయమయింది, నేను వెళ్ళాలి అన్నాడు. ఆయన్ని ఎవరూ అడ్డుకోలేదు. అతడు సరాసరి భిక్ష ఐన తర్వాత ఒక్కసారి తన గురువు ఎవరని ఆలోచించుకున్నాడు. ప్రశ్నించుకుంటూ ఉంటే తనకొక విషయం తట్టింది. తనలో మార్పునకు కారణమైన వ్యక్తే తనకి గురువు అని నిర్ణయించుకున్నాడు.

అంతే వెంటనే తను ఎక్కడైతే మొట్టమొదట బిక్షాటన చేసుకున్నాడో ఆ గ్రామం గూర్చి బయలుదేరాడు. దారిలో ఇతన్ని గుర్తించిన వాళ్ళు కలసి చూసి వచ్చిన వాళ్ళు, అక్కడ వేదం చదువుకున్న వాళ్ళే కాదు ఆ సత్రంలో భోంచేసిన వాళ్ళు అందరూ ప్రతి గ్రామంలోను గుర్తించి ఇతనికి స్వాగతం పలకడం అయనకేదో ఇవ్వడం అతను ఆ ధనాన్ని ఆ గ్రామంలోనే ఖర్చుపెట్టమని చెప్పి పెద్దలకు ఇచ్చేస్తుంటే తానేమీ తీసుకోకపోవడం ఈయన ఖ్యాతి ఆనోట ఆనోట ప్రతి గ్రామానికి చేరింది. అందరూ ఇతని కోసం ఎదురుచూస్తున్నారు.

ఎట్టకేలకు అతను తన మొదటి గ్రామానికి వచ్చాడు. ఆ గ్రామంలో వాళ్ళు కూడా చాలా ఆనందంతో కరపాత్ర స్వామిజీ వారు వచ్చారు అని చెప్పి ఆయనకి ఆ గ్రామంలో ఉంటున్న పండితుడిని పిలిచారు. ఆయనకూడా వెంటనే అంగీకరించాడు. పండితుడు వెడుతూనే పాద నమస్కారం చేసాడు. ఆయనని మంత్రపూర్వకంగా తీసుకొచ్చి వేదిక మీద కూచోబెట్టారు. ఆయన గురించి నేను చూశానంటే నేను చూశాను, నేనక్కడ సత్రంలో పనిచేశాను, అక్కడ

వేదపండితులు శాస్త్ర పండితులు శాస్త్రములు అన్ని నేర్చుకుంటారు, నేనక్కడున్నాను, వీరిని మళ్లీ ఇక్కడ చూడ్డానికి చాలా ఆనందంగా వుందంటే ఆనందంగా ఉంది, ఇలా చాలామంది మాట్లాడారు. స్వామీజీ కూడా మాట్లాడటం అయిపోయిన తరువాత నాకు భిక్షా సమయం అయింది నేను వెళ్లిపోతానని చెప్పాడు. పండితుల వారు మా ఇంటికి భిక్షకి దయచేయండి అని పిలిచారు. వెంటనే ఆయన అంగీకరించాడు. వాళ్ళింటికి వెళ్ళాడు. ఇద్దరూ లోపల కూర్చున్నారు. ఆయన నియమం ముందే ఎరిగిన ఆతల్లి అతనికి సంప్రదాయ ప్రకారంగా కరతల భిక్ష పెట్టింది. ఆవిడ ఆ భిక్ష పెడుతున్నప్పుడు ఆమెకు ఏదో మాతృత్వం తొణికిసలాడింది. ఇదేం గమనించని స్వామీజీ భిక్షకోసం దోసిలి చాపాడు. ఆవిడకు ఎందుకో అనుమానం వచ్చింది. చూస్తున్నప్పుడే కొంత అనుమానము ఇలా అడిగే సరికి ఇంకా అనుమానం వచ్చింది. సరే అని ఆయన నియమాన్ని భంగ పరచకూడదని కరతలంలో భిక్ష పెట్టింది. 'అమ్మా! నేను ఇది ఎవరికైనా దానం చేసుకోవచ్చు కదా!' అని అడిగాడు. 'అయ్యో అదెంత మాట!' అన్నది ఆ ఇల్లాలు.

వెంటనే పండితుల వారు స్వామీజీ ఆ భాగం నాకు ప్రసాదంగా ఇవ్వండని చెయ్యి పట్టారు. ప్రసాదంగా ఇచ్చేశాడు భోజనం ప్రారంభించారు. ఆ ఇంటి అన్నపూర్ణ వడ్డిస్తోంది. గృహ యజమాని ఐన పండితుడు అతిథి ఐన స్వామీజీ ఇద్దరు కూడ భోజనం చేస్తున్నారు.

ఆ సమయంలో స్వామిజీ అడిగాడు. 'పండితుల వారు నన్ను గుర్తు పట్టారా?' అని. 'అబ్బే నేనెప్పుడూ కాశీ మహానగరం రాలేదండీ నాకు అంత అవకాశం రాలేదు' అన్నాడు. 'సరే నేనెవరో చెప్తా వినండి' అన్నాడు. పండితుడు 'వద్దండీ శాస్త్ర ప్రకారమూ ఏరుల(నదుల), శూరుల, మహనీయుల మహాత్ముల జన్మ రహస్యం అడగకూడదు' అన్నాడు. 'సరే మీరు అడగలేదు. నేనే చెప్తున్నాను వినండి. నాగురుదేవులు మీరే!' అన్నాడు స్వామి. 'అబ్బే నేను పండితుడను. అంతవరకే' అన్నాడు.

అయ్యో ముందు వినండి. 'నేను ఎవరో కాదు. మీ మూడు జన్మల ముష్టివాణ్ణి' అని చెప్పాడు. పండితుడు ఒక్కసారిగా భోజనం మానేసి నిశ్చేష్టుడయ్యాడు. ఆ ఇల్లాలైతే ఏకంగా కన్నీరు పెట్టుకుంటూ వచ్చి స్వామి పాదాలపై పడి 'పతి భిక్ష పెట్ట'మని ప్రార్థించింది. 'అంత

మాటలొద్దు అమ్మా. ధర్మం చెప్పేవాడు నిష్కర్షగా చెప్పాలి. ఆనాటికే కాదు ఈనాటికీ నేను సామాన్యుడినే. కానీ ఆ రోజు పండితుల వారు అంత తీవ్రంగా అంత కఠినంగా చెప్పకపోతే నాలో మార్పు వచ్చేది కాదు. నేను ఈనాడు ఈస్థితికి వచ్చేవాణ్ణి కాదు. అంచేత మీరే నా గురువు అంటూ నమస్కరించారు' స్వామీజీ. 'లేదు లేదు మీరే నాకు జ్ఞానోపదేశం చేశారు. నేను మహా అహంకారిని. పండితుడని గర్వం ఉండేది. నా గర్వాన్ని పోగొట్టారు కాబట్టి మీరే నాకు గురువు' అన్నాడు పండితుడు.

అహంకారాలు పోయాయి గనక ఇద్దరి భావాలు ఒకటయ్యాయి. ఇద్దరూ హాయిగా పరమానంద అనుభూతిని పొందారు. బెనారస్ యూనివర్శిటీ కాశీ విశ్వ విద్యాలయంలో ఇప్పటికీ ఈ కరపాత్ర స్వామీజీ పేరుతో బహుమతులు ఇస్తున్నారు.



# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీకొండ ఈశ్వరరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ఆ తరువాత ప్రతిరోజు చంద్రుడు కాంతిలోను ఆకారంలోను పెరుగుతూ, అష్టమి నాటికి అర్ధవృత్తాకారంగా, మంచి కాంతితో వృద్ధి పొందుతాడు. అలాగే దినదినాభివృద్ధి పొందుతూ పూర్ణిమ నాటికి సంపూర్ణ వృత్తాకారంగాను, పూర్ణ చంద్రుడై పదహారు కళలతోను ప్రకాశిస్తాడు. ఆనాటి పూర్ణ చంద్రుని కాంతి పూర్ణ కాంతి. రూపము పూర్ణ రూపము. అది పూర్ణిమ తిథి ప్రత్యేకత. దానికి ఒకరోజు కలిపినా (బహుళ పాడ్యమి), ఒక రోజు తీసివేసినా (శుద్ద చతుర్దశి), చంద్రుని కాంతిలోను, ఆకారంలోను, (తరుగుదల) మార్పు వచ్చేస్తుంది.



తానెవరో తెలియని అజ్ఞానమనే చీకటియే అమావాస్య. సద్గురుదేవుల పరమానుగ్రహంతో జ్ఞానమనే చంద్రుడు వుదయించటం మొదలు పెడతాడు. అదే నెలపొడుపు. విశ్వాసమును అచంచలంగా నిలుపుకుని, సద్గురుదేవులు నిర్దేశించిన మార్గంలో సాధన చేస్తున్న కొలది, గురుకృప వలన క్రమంగా అజ్ఞానమనే చీకటి తొలగిపోవటము, జ్ఞానమనే వెన్నెల వెలుగులు మరింతగా వ్యాపించటము జరుగుతుంది. సాధన సంపూర్ణమయ్యే నాటికి (పూర్ణిమ), పరిణామం చెందుతూ జనన మరణములకు లోనయ్యే యీ శరీరం తాను కాదని, దానిని, సమస్త సృష్టిని ప్రకాశింపజేసే ఆత్మవస్తువే తాననే ఆత్మజ్ఞానం పరిపూర్ణంగా పొందుతాడు మానవుడు. ఇక అతనికి తెలియనిది గాని, తెలుసుకోవలసినది గాని

ఏమీ ఉండదు. అదే పూర్ణత్వము. పూర్ణిమ నాటి చంద్రునికి హాని వృద్ధులుంటాయి గాని, ఆత్మజ్ఞాన పూర్ణుడైన మానవుడు మళ్ళీ ఎన్నటికీ అటువంటి అజ్ఞానంలో పడడు.

కొబ్బరిచెట్టు ఎదుగుతున్న కొలది, పాత ఆకులు రాలి, కొత్తవి పెరుగుతూ ఉంటాయి. అది పూర్తిగా ఎదిగినప్పుడు కచ్చు వేస్తుంది. ఫలాన్నిస్తుంది. అలాగే మానవ బుద్ధి వికసిస్తున్న కొలది అతనిలోని అజ్ఞానం తొలగిపోయి, 'అహం బ్రహ్మాస్మి' అనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అదే కచ్చు వేయటం. దాని నుండి లభించే ఆత్మానందమే ముక్తి ఫలం. అటువంటి ముక్తి ఫలాన్ని కోరే మానవుడు, దానిని ప్రసాదించగల సత్య గురువును ఆశ్రయించాలి. వారియందు పూర్ణ విశ్వాసము నిలుపుకోవాలి. వారు ప్రసాదించిన లక్ష్యార్థ సాధనకై శ్రద్ధా భక్తులతో కృషి చేయాలి. సత్సంగము, సంకీర్తనము సాధకునికి అమూల్యమైన సహచరులు. వాటి సహాయంతో మానవుడు పూర్ణ మానవుడు కావటానికి, అంటే మాధవుడు కావటానికి నిర్విరామంగా కృషి చేసి పూర్ణత్వమును సాధించటమే మానవ జన్మకు సార్థకత. ఒకసారి మాధవత్వాన్ని పొందాక యిక అతడు మానవత్వానికి ఎన్నడూ దిగజారడు. కాయ పండౌతుందిగాని, పండు మళ్ళీ కాయ ఎన్నటికీ కాదు.

అటువంటి సత్సంకల్పంతో మనమీనాడు సంకీర్తన, సత్సంగ సమావేశము జరుపుకున్నాము. ఇక నుండి ప్రతి నెలా యిదే రోజున, అంటే శుద్ధ తదియనాడు మనం యిలాగే యిక్కడే సమావేశం అవుదాము. జగజ్జనని అటువంటి సత్సంకల్పమును మీ అందరి హృదయాలలోను నెలకొల్పి , లక్ష్యార్థ సాధనకు కావలసిన అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను మీకు ప్రసాదించు గాక!" అని తమ దివ్య సందేశమును అందించారు.

ఆ నాటి నుండి ఈశ్వరరాజు గారు ప్రతినెలా శుద్ధ తదియ

నాడు తమ యింటిలో యీ సత్సంగ, సంకీర్తన సమావేశమును నిర్వహించారు. శ్రావణ శుద్ధ తదియనాడు జరిగే వార్షిక సత్సంగ సమావేశాన్ని శ్రీ బాబు ఎక్కడ ఉంటే అక్కడ నిర్వహించేవారు. వారి తదనంతరం కూడా వారి సంతానము యీ సమావేశములను క్రమం తప్పక యీనాటికీ జరుపుకుంటున్నారు. అది శ్రీ గురుదేవులు, వారి తండ్రిగారి ద్వారా వారికి అందజేసిన అమూల్యవరం.

శ్రీ బాబు అవ్యాజ కరుణతో పూర్తిగా ప్రభావితులైన ఈశ్వరరాజుగారు శ్రీశైలంలోను, తిరుపతిలోను, ద్వారకా తిరుమలలోను ఎన్నెన్నో పుణ్యకార్యాలు చేశారు. మహాశివరాత్రి నాడు దీక్షగా అభిషేకములు, పూజలు జరుపుకొని, శివరాత్రి ఘడియలు వచ్చాయా అని అడిగి తెలుసుకొని, ఆ పవిత్ర క్షణాలలో తనువు చాలించి శివసాయుజ్యం పొందారు.

**సీ. శ్రీ కాళీకామాతృ చింతనామృత సేవ**
**నానంద పాయినే । తే నమోస్తు ।**
**కాళీప్రసాదాయ । లీలా వినోదాయ ।**
**దేవాది దేవాయ । తే నమోస్తు ।**
**నానాత్వహారిణే । జ్ఞాన ప్రదాయినే ।**
**దీనావనోత్సాహినే । నమోస్తు ।**
**దేహమేవాస్మీతి మోహ మూలాజ్ఞాన**
**తిమిరాపహారాయ తే నమోస్తు ।**
**తే ॥గీ॥ దివ్య లీలావతారాయ । తే నమోస్తు ।**
**దేశకాలానిబద్ధాయ । తే నమోస్తు ।**
**ధీ ప్రచోదేన నిపుణాయ । తే నమోస్తు ।**
**మాననీయ మమ గురవే । తే నమోస్తు ॥**

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

శివాజీ మెడపై గాట్లు పడ్డాయి. అయినా "వ్యాఘ్రమాతా! నీకు, నీ పిల్లలకు హాని తలపెట్టే ఉద్దేశ్యం లేదు. నా గురుదేవులకు కడుపులో బాధగా ఉంది. దానికి నీ పాలే మందు కావున నీ తనయుడనైన నా కోర్కె తీర్చవా?" అన్నారు చేతులు జోడించి. పులి సౌమ్యంగా మారింది. పాలు పిండుకోనిచ్చింది. "జై జై రఘువీర సమర్థ" అని పులివీపు నిమిరాడు. గుహ బయటకు వచ్చాడు. గుహలోనుంచి "జై జై రఘువీర సమర్థ" అని సమర్థుల గొంతు వినిపించింది. శివాజీ పాలగిన్నె అందించి "స్వామీ! ఈ పాలు సేవించండి. మీకు ఉపశమనం కలిగాక మాట్లాడుకుందాం" అన్నాడు శివాజీ. "స్నానం చేసిరా ఇద్దరం కలిసి భోంచేద్దాం!" అన్నారు సమర్థులు.

పాలగిన్నె శ్రీరాముడికి నైవేద్యం సమర్పించి "శివాజీ! ఇవి పులిపాలు కాదు. సాక్షాత్తు జిజియాబాయి పాలు" అంటూ సగం తను త్రాగి మిగిలినవి శివాజీకి ఇచ్చారు. గురువు ఉచ్ఛిష్టాన్ని ఆనందంతో, తన్మయత్వంతో స్వీకరించాడు శివాజీ. భోజనాల సమయంలో "నాకు కడుపు నొప్పా పాడా? మొత్తానికి చాలా శ్రమ పడ్డారు మీరు" అన్నారు సమర్థులు."స్వామీ! మీ సేవకు ఒకింత పాత్రత లభించింది. నాకు ఇంకేమికావాలి? నాకు గురుతత్వం బోధించండి" అన్నాడు శివాజీ. "గురు తత్వం తర్వాత చెబుతాను. శిష్యుడు ఎలా ఉండాలి అంటే మా కళ్యాణ్‌లా ఉండాలి. గురుసేవ అంటే ఏమిటి? గురు ఆజ్ఞ పాలించటం ఎలా? అనేవి అతనిని చూసి నేర్చుకోండి. గురుదేవుల పట్ల విశ్వాసం, గురుపాదములపై భక్తి, గురు వాక్యములపై శ్రద్ధ ముఖ్యం. గురు ఆజ్ఞా తత్పరుడు గురు వాక్యములపై అపార విశ్వాసం కలిగి ఉంటాడు. చూడండి శివాజీ!" అంటుండగా "శివా" అని పిలవండి చాలు అన్నాడు శివాజీ. "ప్రతి వాడికి తాను అంటే ఎంతోప్రీతి. వివాహం ముందు తల్లిపై అపారమైన ప్రేమ ఉంటుంది. పెళ్ళి అయ్యాక అతనికి తల్లిదండ్రుల

కంటే భార్య ఎక్కువ అవుతుంది. తరువాత కొడుకుపై ప్రేమ పెంచుకుంటాడు. అర్జునుడిని చూడండి. అభిమన్యుణ్ణి గురించి ఏం చేయలేదు? తర్వాత ధన పిశాచం. దానిని వదిలించుకోవటం కష్టం. తర్వాత రాజ్యకాంక్ష. ఈ ప్రేమలన్నింటిని మించి గురుదేవుడి కోసం అన్నిటినీ కూడా తృటిలో త్యజించ గలగడం నిజమైన శిష్యుని లక్షణం. నా గురించి మీరు ఏం చేయలేదు? నీ రాజ్యం నాకు అంకితం చేశావు. నీ ప్రాణాలను సైతం లెక్కచేయక పులిపాలు తెచ్చావు. శివాజీ! ఇది చాలా తక్కువయ్యా! గురుతత్వం ఇంకా లోతైనది. ఆ తత్వాన్ని అర్థం చేసుకోవాలంటే.... గురుదేవుణ్ణి అర్థం చేసుకోవాలంటే...." అంటూ ఆయన సమాధిలోకి వెళ్ళిపోయారు. శివాజీ కూడా అదే స్థితిలో వున్నాడు. శివాజీ వెన్ను తట్టి ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నారు సమర్థులు.

ఒకసారి 'మీరజ్'లో సమర్థుల శిష్యులైన జయరామ స్వామిని పిలిచి సత్సంగం, కీర్తన చేయమని ఆజ్ఞాపించి తను నదికి స్నానానికి వెళ్ళారు. సత్సంగంలో ప్రసంగం చేస్తూ "ఎవరైనా క్షణకాలం గురు సన్నిధిలో గాని, సజ్జన సాంగత్యంలో గాని గడిపితే రామ దర్శనం కలుగుతుంది. ఇందులో సందేహం లేదు" అని చెప్తున్నారు జయరామ స్వామి. తురక వాళ్ళ కోట అధికారి జలాల్ ఖాన్ ఈ ప్రసంగం విని, అతనిని తన వద్దకు పిలిపించాడు. "నేను గంటసేపు మీ సత్సంగంలో గడిపాను. నాకు రామదర్శనం కలుగలేదు. మీ మాటలు ఋజువు చేసుకోండి. లేకపోతే గోమాంసం తినాల్సి ఉంటుంది. గోమాంసం తినలేకపోతే మీ శిరస్సు అర్పించుకోవలసి ఉంటుంది" అన్నాడు.

జయరామ స్వామి "రామదర్శనం చేయించే శక్తి నాకు లేదు. సమర్థులైన మా గురువులే మీకు రామదర్శనం చేయిస్తారు" అని, గోపాల్ అనే శిష్యునితో సమర్థులకు కబురు పంపాడు. ఆ సమయంలో సమర్థులు ధ్యానంలోవున్నారు. ఆయన కళ్ళు తెరిచాక గోపాల్ ఆయనకు ఈ విషయం చెప్పాడు.

- సశేషం

## శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము,
## పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.

Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

నవంబరు 30 నుండి డిసెంబరు 7 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన
శ్రీ సద్గురు దేవుల 35వ వార్షిక పుణ్యారాధన దృశ్యములు.



భక్తులచే
తీర్థ స్వీకరణ



మహా
మంగళ హారతి



శ్రీ సద్గురుదేవుల
ఊంజల సేవ



శ్రీ సద్గురుదేవుల
రథయాత్రా
మహోత్సవము

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2024-2026

నవంబరు 30 నుండి డిసెంబరు 7 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన
శ్రీ సద్గురు దేవుల 35వ వార్షిక పుణ్యారాధన దృశ్యములు.



శ్రీ సద్గురు దేవుల మహాభిషేకము



పూజ్యశ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామీజీ (పెదపులిపాక) వారి సన్మానము

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.